## క్లుప్తంగా

### పాఠశాలకు టీవీ అందజేత



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు టీవీ అందజేస్తున్న ఎంఈఓ ఛత్రునాయక్, దాతలు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గుంటిపల్లి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు ఉమాదేవి, కవితలు రూ.12 వేల విలువ గల టీవీని ఎంఈఓ ఛత్రునాయక్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, బట్టు మధు, కట్టా మాధవి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగశంకర్, రవి, వెంకటలక్ష్మి, స్వాతి తదితరులు ఉన్నారు.

### ఆలయానికి వెండి వస్తువు బహూకరణ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయానికి నల్లగొండకు చెందిన ములుగు లింగంబాబు– సత్యావతి దంపతులు గురువారం రూ.10 వేల విలువ గల 11 తులాల ఆవు, దూడ వెండి వస్తువును ఈఓ లక్ష్మణరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నిరసన

హుజూర్‌నగర్ : రైతుల సమస్యలపై ఈనెల 6న హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు బెల్లంకొండ అమర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నిరసన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.


### కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా జానయ్య



సమావేశంలో నాయకులు, కార్యకర్తలు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ రఘునాథపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు పసుపులేటి జానయ్య నియమితులయ్యారు. గురువారం గ్రామంలో మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మండల చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నిజామ్, మాజీ ఎంపీటీసీ మేడి సామేల్, నాయకులు నాగుల్‌మీరా, జాన్ బాబు, మాతంగి జోజి, నరసింహారావు, వెంకటనారాయణ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

### శ్రీకంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో గౌడ కులస్తుల కుల దైవమైన సురమాంబ సమేత కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గౌడ కులస్తులు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున ప్రదర్శనగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌడ కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

### కాలంతో పోటీపడితేనే విజయం సాధ్యం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

నేరేడుచర్ల : ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలంతో పోటీపడితేనే విజయం సాధ్యమవుతుందని మండల విద్యాధికారి ఛత్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో యూటిప్స్ అంతర్జాతీయ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ (డిజిటల్ ఎడ్యుకేషన్)ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొణతం సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎండిన చెరువులు.. నీటికి కష్టాలు



వేణుగోపాలపురంలో ఎండిపోయిన చెరువు



బృందావనపురంలో ఊరచెరువు ఇలా..

- పలు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- నీరు దొరక్క అల్లాడుతున్న మూగజీవాలు
- సాగర్ నీటితో చెరువులు నింపాలని కోరుతున్న ప్రజలు

నడిగూడెం : వర్షాభావ పరిస్థితులు, ప్రస్తుత ఉష్ణోగ్రతల ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో నడిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. మండల కేంద్రంలోని శ్రీసారంగేశ్వరస్వామి చెరువు, బస్టాండ్ వద్ద గల చౌదరి చెరువుతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, వల్లాపురం, సిరిపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి గ్రామాల పరిధిలోని చెరువులు పూర్తిగా అడుగంటాయి. పలు చెరువులు చుక్క నీరు లేకుండా పూర్తిగా ఎండిపోయాయి. దీంతో మండలంలో తాగునీటి కోసం ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. అంతేకాకుండా నీరందక యాసంగి సీజన్‌లో చెరువుల కింద, బోర్ల ఆధారంగా సాగు చేసిన వరి పంట దాదాపు 2500 ఎకరాలకు పైగా ఎండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటికి కటకట**

భూగర్భ జలాలు అడుగంటడంతో మండల వ్యాప్తంగా గ్రామాల్లో తాగు నీటి సరఫరా చేసే బోర్లకు సరిపడా నీరందడం లేదు. దీంతో తాగు నీటి సమస్య ఏర్పడింది. చెరువులలో నీరు లేకపోవడంతో మూగజీవాలకు కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసింది. అదేనీటిని మండల పరిధిలోని చెరువులకు మేజర్ కాల్వలు, ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేసి నింపాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### సాగర్ నీటితో చెరువులు నింపాలి



వర్షాలు లేకపోవడంతో మండలంలోని చెరువులు అడుగంటాయి. కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాకు సాగర్ నీరు విడుదల చేస్తున్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాగర్ నీటితో చెరువులను నింపాలి.

– దొంతగాని శ్రీనివాస్, బృందావనపురం

### మూగజీవాలకు నీరు దొరకడం లేదు



తాగు నీరు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. నడిగూడెంలోని శ్రీరంగేశ్వరస్వామి చెరువు, చౌదరి చెరువులు పూర్తిగా అడుగంటాయి. ప్రస్తుతం విడుదల అవుతున్న సాగర్ నీటితో ఆయా చెరువులను నింపితే మూగజీవాల దాహార్తి తీరుతుంది.

– సీమ ప్రభుదాసు, నడిగూడెం

# సాగర్ నీటితో చెరువులను నింపాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



మునగాల వద్ద సాగర్ ఎడమ కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న శానంపూడి సైదిరెడ్డి

మునగాల : సాగర్ ఆయకట్టు ప్రాంతాలైన మిర్యాలగూడెం, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నిర్బంధంగా తరలించడం సబబు కాదని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం మునగాల శివారులోని సాగర్ ఎడమ కాలువలో నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో బోర్లు, బావులలో నీరు అడుగంటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మూడు నియోజకవర్గాలలోని చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆయకట్టు పరిధిలో ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా రూ.రెండు లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వం నల్లగొండ నియోజకవర్గ పరిధిలో 3.15 లక్షల మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్, రైతాంగానికి రూ.6 వేల నగదు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో సూర్యాపేట జిల్లా పరిధిలోని గ్రామాలకు తాగు నీటిని విడుదల చేయకపోతే రైతాంగాన్ని సమీకరించి ఎడమకాలువ గేటు బద్దలు కొడతామని సైదిరెడ్డి హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల్లో రైతాంగం బీజేపీకి ఓటు వేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, జిల్లా నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, కనగాల నారాయణ, నూనె సులోచన, మల్లెబోయిన అంజియాదవ్, సాతులూరి హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షులు భద్రంరాజు కృష్ణప్రసాద్, దున్న సతీష్, మోదుగు శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు వీరబాబు, దాసరి మధు, గోపి, చిన సైదులు, గోవిందాచారి, ప్రభాకర్ పాల్గొన్నారు.

# పాలేరుకు నీటి తరలింపు అన్యాయం



గరిడేపల్లి : ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, రైతులు

గరిడేపల్లి : ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, తూముల వద్ద పోలీసు బందోబస్తు ఉంచి సాగర్ నీటిని పాలేరు జలాశయానికి తరలించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, (ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ నాయకుడు పోటు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. సాగర్ నీటితో చెరువులు నింపాలని గురువారం మండలంలోని వెలిదండ గ్రామంలోని ఎస్ఎస్పీ కాలువపై సీపీఎం, డెమొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మేకల కనకారావు, నందిగామ సైదులు, కామళ్ల నవీన్, ఎల్లావుల సైదులు, శ్రీకాంత్, యానాల సోమయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**ఎత్తిపోతల పథకాలను విద్యుత్‌ను పునరుద్ధరించాలి**

మునగాల : సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాలకు విద్యుత్‌ను నిలిపివేసి నిర్బంధంగా పోలీస్ పహారాలో సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలించడం సబబు కాదని, లిఫ్టులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగర్‌నీటితో చెరువులు, కుంటలు నింపాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, జయభారత్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొక్కిరేణి ఎత్తిపోతల పథకం ఆవరణలో నిర్వహించిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో లిఫ్ట్ మాజీ చైర్మన్ పోటు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నందిగామ సైదులు, కామళ్ల నవీన్, ఎల్లావుల సైదులు, శ్రీకాంత్, యానాల సోమయ్య, వట్టిపు సైదులు పాల్గొన్నారు.

**చెరువులు నింపాలి**

నేరేడుచర్ల : సాగర్ నీటితో చెరువులు నింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం సాగర్ నీటిని విడుదల చేసి పెద్దదేవులపల్లి రిజర్వాయర్, ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌ను నింపుతున్నందున నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎడమ కాలువ పరిధిలోని చెరువులన్నింటినీ నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు రావుల సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను, ఉదర వెంకన్న, వెంకట్, గోవింద్ తదితరులు ఉన్నారు.

**తాగునీటి సమస్య పరిష్కరించాలి**

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సాగర్ ఎడమ కాలువ పరిధిలో గల చెరువులను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్ కోరారు. గురువారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో నీటిఎద్దడి ఉన్నందున సాగర్ నీటితో చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

**గ్రామాల్లో నీటి ఎద్దడి**

పాలకవీడు : భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడిందని, సాగర్ నీటితో చెరువులు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి కె.అనంతప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**సాగర్ నీటి తరలింపు సమంజసం కాదు**

మునగాల : సాగర్ నీటిని నిర్బంధంగా పాలేరు జలాశయానికి తరలించడం సబబు కాదని సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతుంటే జిల్లా మీదుగా సాగర్ నీటిని మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న గ్రామాలలో ఉన్న చెరువులు, కుంటలను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



సర్వారంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామలక్ష్మణ, ఆంజనేయ, అభయాంజనేయ, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, రాజనాలమ్మ, సత్తెమ్మతల్లి, పోతరాజుల ఆలయాల్లో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం వేదపండితుల మంత్రోత్సవాల నడుమ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆవు, ఆంబోతులకు కల్యాణం నిర్వహించారు. గ్రామ పురోహితులు దోన సుబ్రహ్మణ్యశర్మ, దోన శ్రీనివాస్‌శర్మ, బలరామశర్మ, రాళ్లబండ రాజశేఖర్ శర్మ, రాయపోలు శ్రీరామశర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వేలాది మంది తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

### నేడు కోదాడలో రైతు దీక్ష

హుజూర్‌నగర్ : భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు శుక్రవారం కోదాడలో నిర్వహించబోయే రైతు దీక్షను విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంబట్ల నరేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమనికి బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డిలతో పాటు నాయకులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### వాసవీమాతకు పూజలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో గురువారం ఇంటింటా ఆర్యవైశ్యుల కుల దేవత కన్యాకాపరమేశ్వరి వాసవీ మాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వాసవీ, వనితా లెజెండ్ క్లబ్ ఆధ్వర్యంలో 102 గృహాలలో అమ్మవారికి అష్టోత్తరం, లలితా సహస్ర నామం, పూజ, హారతి, తీర్థ ప్రసాదం వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల కార్యవర్గ సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# తూముల వద్ద పోలీసుల బందోబస్తు



కొత్తగూడెం మేజరు కాల్వ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ మల్సూర్, సిబ్బంది

నడిగూడెం : ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు తాగు నీటి అవసరాల నిమిత్తం విడుదల చేసిన సాగర్ నీటిని వృథా చేయకుండా నడిగూడెం మండల పరిధిలోని రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల వద్ద గల మేజర్ కాల్వల తూముల వద్ద బందోబస్తు కొనసాగుతోంది. పోలీసు శాఖతో పాటు నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది విడతల వారీగా రాత్రింబవళ్లు పహారా కాస్తున్నారు. తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్.డి.ఇమామ్, ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, ఏఎస్‌ఐ మల్సూర్, నీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు,పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

మఠంపల్లి : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 6న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ కోరారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, ఆలిండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా పాల్గొని కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టోను ప్రకటిస్తారని తెలిపారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మాజీ సర్పంచ్ బుజ్జిభీముడునాయక్, తులసీరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

నడిగూడెం : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 6న నిర్వహించబోయే కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలి**

పాలకవీడు : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 6న జరగబోయే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ భూక్యా గోపాల్ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గరిడేపల్లి : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 6న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేయనున్నారని, ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ఆర్ఎంపీ రమేష్‌బాబు మృతితో మఠంపల్లిలో విషాదఛాయలు



రమేశ్‌బాబు (ఫైల్)

మఠంపల్లి : మండల కేంద్రంలో సుమారు 50 ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందించిన ఆర్ఎంపీ రమేశ్‌బాబు (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన కుమారుని గృహంలో మృతి చెందారు. దీంతో మఠంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కాగా, సుమారు 50 ఏళ్ల క్రితం కృష్ణా జిల్లా నుంచి మఠంపల్లికి వచ్చిన రమేశ్‌బాబు జీవితకాలమంతా మఠంపల్లిలోనే వైద్య వృత్తి చేశాడు. ముఖ్యంగా పాయిజన్ కేసులలో తనదైన శైలిలో ఎంతోమంది ప్రాణాలు కాపాడి గుర్తింపు పొందాడు.

### పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు పోరాటం

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా కేంద్ర కమిటీ సభ్యుడు గొకినేపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈమేరకు గురువారం నేరేడుచర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడేళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తుంటే ఏ ఒక్క రాజకీయ నాయకుడు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, వెంకన్న, లలిత, రేణుక, అఖిల్ తదితరులు ఉన్నారు.


### ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి ఊరచెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గురువారం స్థానిక ఆశా కార్యకర్తలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జానకిరాములు, ఏపీఓ ఉమాదేవి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా మండిపోతున్నందున ఉపాధి హామీ కూలీలు 11 గంటల వరకే పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మాధవి, కోటేశ్వరి, పద్మ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎరగాని గాంధీ (72) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్(78) అనారోగ్యంతో మృతి చెందాడు. వారి మృతదేహాలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, మండలపు శేషు, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఎరగాని లక్ష్మయ్య, ఎండి.రఫీ, కుక్కడపు సైదులు, నాగరాజు, రఫీ తదితరులు ఉన్నారు.

# డైట్ కళాశాల రిటైర్డ్ పీడీ శౌరెడ్డి మృతి



గాదె శౌరెడ్డి (ఫైల్)

మఠంపల్లి : నల్లగొండ డైట్ కళాశాల రిటైర్డ్ పీడీ గాదె శౌరెడ్డి (72) చికిత్స పొందుతూ గురువారం హైదరాబాద్‌లో మృతి చెందారు. దీంతో శౌరెడ్డి స్వస్థలం మఠంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మందుగా శౌరెడ్డి పార్థివదేహాన్ని స్థానిక శుభవార్త చర్చిలో ఉంచి పాదర్ మార్టిన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు జరిపారు. పలువురు నాయకులు శౌరెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, శౌరెడ్డి తండ్రి దివంగత గాదె పాపిరెడ్డి మఠంపల్లి సర్పంచ్‌గా, సోదరుడు దివంగత గాదె ఎలియాస్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా గతంలో పదవులు చేపట్టారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గాదె లూర్దుమారెడ్డి, శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, గాలి చిన్నపురెడ్డి, ఆంతోనిరెడ్డి, బాలశౌరెడ్డి, థామస్‌రెడ్డి, జార్జిరెడ్డి, ఇన్నారెడ్డి, గుర్రం మట్టారెడ్డి, మన్నెం శేషిరెడ్డి, మన్నెం శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా చేతిపంపు



కరివిరాల క్రాస్ రోడ్డు వద్ద నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

నడిగూడెం : మండలంలోని కరివిరాల క్రాస్ రోడ్డు వద్ద చేతిపంపు గత రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. కరివిరాల క్రాస్ రోడ్డు వద్ద నుంచి కరివిరాల, చెన్నకేశ్వాపురం, కాగితరామచంద్రాపురం, నారాయణపురం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. చేతిపంపు ఉపయోగంలో ఉంటే వీరికి తాగునీరు అందుతుంది. అలాగే కరివిరాల, కాగితరామచంద్రాపురం గ్రామాల ప్రజలు ఇక్కడి చేతి పంపు నీటిని తాగునీటిగా ఉపయోగిస్తారు. ఎండలు మండిపోతున్నందున సంబంధిత అధికారులు తక్షణమే చేతిపంపుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# పశువులకు మేతగా వరి పంట



నారాయణపురం వద్ద నర్సిరెడ్డికి చెందిన ఎండిన పొలాన్ని మేస్తున్న పశువులు

నడిగూడెం : మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో అట్లూరి నర్సిరెడ్డికి చెందిన వరి పొలం చేతికొచ్చే దశలో నీరందక పూర్తిగా ఎండి పోయింది. దీంతో గ్రామానికి చెందిన పశువులకు ఎండిన వరి చేను మేతగా మారింది. నర్సిరెడ్డి సాగర్ ఎడమ కాల్వకు మోటారు ఏర్పాటు చేసుకొని తనకున్న నాలుగు ఎకరాలలో వరి సాగు చేపట్టాడు. తీరా పంట చివరి దశలో నీరందకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. కాగా, నాలుగు ఎకరాలకు దాదాపు రూ.80 వేలకు పైగా పెట్టబడి పెట్టానని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పీవీ రమణారావు మాట్లాడుతూ పై తరగతులకు వెళ్లే విద్యార్థులకు మంచి అనుభూతిని ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ గ్రాడ్యుయేషన్ కార్యక్రమమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం

కోదాడరూరల్ : కోదాడకు చెందిన గుడిమళ్ల రాకేష్– పూజ దంపతుల కుమారుడు అర్విక్‌ముకుంద్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో పేదలకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని 27వ వార్డు కౌన్సిలర్ షాబుద్దీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాటినీడి కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణరెడ్డి, ఉప్పగండ్ల శ్రీను, ఉపేందర్ రెడ్డి, పోటు నాగేశ్వరరావు, పొందూరు వెంగళరావు తదితరులు ఉన్నారు.